క్లుప్తంగా

జేసీఎస్ కన్వీనర్‌గా మధుసూదనరావు


మధుసూధనరావు

గుర్ల: జేసీఎస్ మండల కన్వీనర్‌గా కొండగండ్రేడుకు చెందిన కెంగువ మధుసూదనరావును నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. జేసీఎస్ కన్వీనర్‌గా తనకు అవకాశం కల్పించిన మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు మధుసూదనరావు కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలో పార్టీ గెలుపునకు తనవంతు కృషిచేస్తానన్నారు. మధుసూదనరావు జిల్లా అగ్రికల్చరల్ అడ్వైజరీ డైరెక్టర్‌గా కూడా సేవలందిస్తున్నారు.

ట్యాబ్‌ల వినియోగం తప్పనిసరి

- డీఈఓ ప్రేమకుమార్


విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న డీఈఓ

చీపురుపల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 8, 9 తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను తప్పనిసరిగా వినియోగించాలని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ట్యాబ్‌ల వినియోగం, జగనన్న గోరుముద్ద అమలు తీరును పరిశీలించారు. ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా వినియోగించేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం విజయరాంపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం


ఆరోగ్య సేవలందిస్తున్న వైద్యులు

దత్తిరాజేరు: 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంతో పేదలకు ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతున్నాయని ఆర్.రామచంద్రాపురం సర్పంచ్ బేత శ్రీదేవి అన్నారు. గ్రామంలోని హైస్కూల్ వద్ద శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరాన్ని కె.కొత్తవలస వైద్యాధికారి రఘుతో కలిసి ప్రారంభించారు. ఆరోగ్య సురక్ష–1 మంచి ఫలితాలు ఇవ్వడంతో ఇప్పుడు ఆరోగ్య సురక్ష–2 ద్వారా ప్రజలకు వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో సుమారు 180 మందికి బీపీ, సుగర్, రక్తపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన


పోటీలో పరుగుతీస్తున్న ఎడ్లు


వేపాడ: మండలంలో చామలాపల్లి గ్రామంలో వీరాంజనేయస్వామి, సంతాన సుబ్రహ్మణ్యస్వామి తీర్థమహోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్లు పరుగు ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ పోటీల్లో వల్లంపూడి ఏడువాక సత్తిబాబుకు చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో, కె.జె.పురం ఆంజనేయస్వామికి చెందిన ఎడ్లు ద్వితీయ స్థానంలో, వావిలపాడు గ్రామం గండి వెంకటరావుకు చెందిన ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, సర్పంచ్ కోలా సతీష్, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, ఎంపీటీసీ టి.వి.రమణ, ఎ.సత్యనారాయణ, కమిటీ సభ్యుల చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


ఆలయ శిఖరానికి అభిషేకం చేస్తున్న భక్తులు

శృంగవరపుకోట: లక్కవరపుకోట మండలంలో కల్లేపల్లి పంచాయతీ పరిధి సీతాగొర్లెవానిపాలెం గ్రామంలో సంపత్ వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. రుత్వికులు నేతేటి మధుకుమార్‌శర్మ నేతృత్వంలో వేదపండితులు ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు 1116 కలశాలతో నీటిని తీసుకువెళ్లి ఆలయ శిఖర గోపురానికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం కోలాటం, భజన కార్యక్రమాలు చేపట్టారు.

అభివృద్ధి, సంక్షేమానికి కేరాఫ్ జమ్ము


జమ్ము గ్రామం వ్యూ

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరుగులు పెడుతున్న ప్రగతి
- రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు
- డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో రూ.15.78 కోట్ల సంక్షేమ లబ్ధి


జమ్ము సచివాలయం


రైతు భరోసా కేంద్రం

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లెలు ప్రగతి పథంతో పయనిస్తున్నాయి. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో ప్రభుత్వం అందించే పౌర సేవలన్నీ ఇంటి వద్దే అందుతుండడంతో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిస్తోందని ప్రతి ఒక్కరూ అంటున్నారు.

మండలంలోని జమ్ము, జమ్ముపేట గ్రామాలు అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్నాయి. నాలుగున్నరేళ్లలో జమ్ము సచివాలయం పరిధిలో సుమారు రూ.4 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.89 లక్షలతో సీసీరోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.21.8 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.5 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ కేంద్రం నిర్మించారు. జగనన్న లేఅవుట్‌లో 21 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు, ఇళ్లు మంజూరు చేశారు. అలాగే సొంత స్థలాలు కలిగి ఉండి ఇళ్లు లేని 24 మందికి ఇళ్ల నిర్మాణం కోసం రూ.81 లక్షలు ఆర్థిక సాయం అందించారు. నాడు–నేడు కింద రూ.35.35 లక్షలు ఖర్చుచేసి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. జమ్ములో రూ.40.74 లక్షలతో, జమ్ముపేటలో రూ.35 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. రూ.2 లక్షలు ఎంపీ నిధులతో రెండు తాగునీటి బోర్లు, రూ.4.5 లక్షలతో 45 సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. అలాగే టీటీడీ నిధులు రూ.10 లక్షలతో గ్రామంలో రామాలయాన్ని నిర్మించారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.15 కోట్ల 38లక్షల 67వేల 541లు నగదును సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు అందించారు. స్థానిక సమస్యలపై గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేసిన వెంటనే సమస్య పరిష్కారానికి సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. అన్ని రకాల పౌరసేవలు గ్రామంలోనే అందుతుండటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇది కదా.. అభివృద్ధి

సచివాలయ పరిధిలో సంక్షేమ లబ్ధి వివరాలు..

పథకం	లబ్ధిదారులు	నగదు
అమ్మ ఒడి	311	రూ.1,49,33,655
జగన్న విద్యాదీవెన	206	రూ.34,61,095
జగనన్న వసతిదీవెన	159	రూ.21,61,884
రైతు భరోసా	582	రూ.2,63,57,250
వైఎస్సార్ చేయూత	238	రూ.1,11,75000
వైఎస్సార్ ఆసరా	274	రూ.45,99,726
డ్వాక్రా సున్నావడ్డీ	696	రూ.4,06,424
హౌసింగ్	45	రూ.81,00,000
వాహన మిత్ర	21	రూ.5,80,000
జగనన్న చేదోడు	40	రూ.7,40,000
వైఎస్సార్ బీమా	10	రూ.9,90,000
ఈబీసీ నేస్తం	05	రూ.1,35000
వైఎస్సార్ కళ్యాణమస్తు	05	రూ.2,50,000
వైఎస్సార్ ఆసరా	274	రూ.45,99,726
వైఎస్సార్ పింఛన్ కానుక	470	రూ.4,51,32,000


జమ్ములో రామమందిరం వద్ద వేసిన సీసీరోడ్డు


జమ్ములో ఇంటింటికీ ఏర్పాటుచేసిన కుళాయిలు


వెల్‌నెస్ కేంద్రం

ఆర్థికంగా అభివృద్ధి చెందాం



ప్రతీ నెల ఒకటో తేదీన వలంటీరు ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తున్నారు. మా కుటుంబానికి రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలు అందుతున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వల్ల మేము ఆర్థికంగా అభివృద్ధి చెందాం.

– మండ సత్యనారాయణ, జమ్ము

రైతులకు అండగా ఉన్నారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులంతా సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారు. గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచడంతో పాటు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. పంట పెట్టుబడికి ప్రతి ఏడాది వరినారు వేసేముందు ఆర్థిక సాయం అందిస్తున్నారు.

– జమ్ము తవిటినాయుడు, జమ్ము

అర్హత ఉన్నవారిందరికి సంక్షేమ పథకాలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నాం. గ్రామంలో సీసీరోడ్లు, సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణం, తదితర అభివృద్ధి పనులు జరిగాయి. అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాం.

– జమ్ము నరసింహమూర్తి, సర్పంచ్, జమ్ము


జమ్ము ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బెంచీలు, ఇతర సదుపాయాలు


జమ్ముపేట జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

నిధులు సక్రమంగా వినియోగించుకోవాలి

- డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ సావిత్రి

గంట్యాడ: స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, మండల మహిళా సమైఖ్యలు ఆర్థికంగా సుస్థిరత సాధించేందుకు నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ పి.సావిత్రి సూచించారు. స్థానిక కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న వెలుగు కార్యాలయంలో శుక్రవారం మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 29, మార్చి 1, 2 తేదీల్లో కేంద్ర బృందం మండల సమైఖ్యను పరిశీలించేందుకు వస్తోందన్నారు. సమైఖ్య సభ్యులు ఆర్థిక అంశాలతో పాటు సామాజిక అంశాలపై కూడా సమావేశాల్లో చర్చించాలన్నారు. సమావేశంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు జననీ, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ అల్లు ఉమామహేశ్వరావు, డీపీఎంలు జయశ్రీ, రాజ్‌కుమార్, బంగారమ్మ, ఏపీఎంలు శ్రీనివాస్, విజయ్‌కుమార్, శైలేష్, సీసీలు రామకృష్ణ, చినబాబు, ముత్యాలనాయుడు, గౌరీశ్వరి, అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.84 లక్షలతో అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: మండల పరిషత్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావుతో కలిసి శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి సుమారు రెండున్నరేళ్లవుతోందని, ఈ కాలంలో రూ.84 లక్షలతో సీసీరోడ్లు, కాలువలు, ఇతర ప్రాధాన్యత పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఈ ఏడాది మరో రూ.42 లక్షలతో వివిధ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. రూ.55 లక్షలతో మండల పరిషత్ కార్యాలయ సముదాయంలో సీసీరోడ్లు, ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, వెలుగు, డూమా, అగ్రికల్చర్ కార్యాలయం మరమ్మత్తు పనులు, సభావేదిక నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.

ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయాలి


ఎండీయూ ఆపరేటర్లుతో మాట్లాడుతున్న సీఎస్‌డీటీ రామారావు

చీపురుపల్లి: ఎండీయూ ఆపరేటర్లు ప్రతీ ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సీఎస్‌డీటీ పిన్నింటి రామారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. రేషన్ లబ్ధిదారులకు ఇంటి వద్దకే సరుకులు చేరవేసేందుకు ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లను నియమించిందని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజాం, గరివిడి సీఎస్‌డీటీలు టి.చిరంజీవి, శోభారాణి, చీపురుపల్లి మండల డీలర్లు సంఘం అధ్యక్షుడు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలి


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సుధారాజు

శృంగవరపుకోట: ప్రభుత్వ సేవలను గ్రామస్థాయిలోనే ప్రజలకు అందించేందుకు వీలుగా ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిందని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సచివాలయ సిబ్బంది పనిచేయాలని ఎంపీపీ సొండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు కోరారు. మండలంలోని కొట్టాం, గోపాలపల్లి, మామిడిపల్లి, ధర్మవరం, పోతనాపల్లి, సంతగవిరమ్మపేట, తలారి, తిమిడి గ్రామ సచివాలయాలను శుక్రవారం సందర్శించి అక్కడి సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రజలకు అందిస్తున్న పౌర సేవలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. స్పందనలో అందిన వినతుల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వేములాపల్లి సర్పంచ్‌లు సూర్యనారాయణ, ఎం.చిన్నంనాయుడు, ఎంపీటీసీ జి.సన్యాసప్పడు, చిట్టిపోలు మంగ, గాలి సన్యాసయ్య, డి.సంతోషికుమారి, ఎంపీటీసీ పదాల ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత


మొక్కలు నాటేందుకు భూమిని చదును చేయిస్తున్న ఎస్సై

గజపతినగరం: స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్సై యు.మహేష్ ఆధ్వర్యంలో సిబ్బంది మొక్కలు నాటారు. స్టేషన్ పరిసరాలను శుభ్రం చేసి వివిధ రకాల పూల మొక్కలు నాటారు. స్టేషన్ పరిసరాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాగునీటి బోరు ఏర్పాటు


మోటార్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి కేజీబీవీలో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో తాగునీటి బోరు, కుళాయిలను ఏర్పాటు చేశారు. ఎంపీపీ చల్లా చలంనాయుడు శుక్రవారం వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, రాచకిండాం పీఏసీఎస్ చైర్మన్ గొల్లు సతీష్, కేజీబీవీ పీఓ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో గ్రామ స్వరాజ్యం


గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
- తామరాపల్లిలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే ప్రారంభం

లక్కవరపుకోట: మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాకారమైందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తామరాపల్లి గ్రామంలో సుమారు రూ.64 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. గ్రామ సచివాలయాల్లో సుమారు 550 పౌరసేవలను ప్రభుత్వం అందిస్తోందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, సర్పంచ్ ముచ్చు భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గురి వెంకటరమణ, లగుడు ఎర్నాయుడు, పిల్లల నాయుడు, రంది ప్రసాద్, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ యడ్ల కిశోర్, కార్పొరేషన్ చైర్మన్ దొడ్డు రాంబాబు, తూర్పాటి అప్పలరాజు, బోకం అప్పారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బ్యాంకు సిబ్బంది సమ్మె

వేపాడ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బ్యాంకు సిబ్బంది శుక్రవారం ఒక్కరోజు సమ్మె చేపట్టారు. దీంతో మండల కేంద్రంలోని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలు నిలిచిపోయాయి. సర్వీసు రూల్స్ మేరకు గ్రాట్యూటీ అందించాలని, అమెండ్‌మెంట్ సర్వీసు రూల్స్, లీవ్ రూల్స్, తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణ, తదితర ఎనిమిది డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశం

దత్తిరాజేరు: మండలంలోని మరడాంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం సమావేశం నిర్వహిస్తారని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. అనంతరం తాడేందొరవలస గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త శంకరరావు కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ


పాఠశాలకు బీరువా అందచేస్తున్న సర్పంచ్ కీర్తి

బొండపల్లి: మండలంలోని నెలివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు స్థానిక సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, అదే గ్రామానికి చెందిన స్టేట్ బ్యాంక్ ఉద్యోగి కె.కుమార్ బీరువాను వితరణ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులకు శుక్రవారం బీరువా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు తాళ్లపూడి అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిష్పాక్షిక విచారణ చేపట్టాలి

గజపతినగరం: విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌పై ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కేంద్ర ప్రభుత్వానికి చేసిన ఫిర్యాదు సమ్మతమేనని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ప్రవీణ్ ప్రకాష్ నుంచి నిష్పాక్షిక రిపోర్టు రావాలంటే ఆయన ముఖ్య కార్యదర్శి పదవిలో ఉండటం సరికాదని, ఆయన్ను ఆపదవి నుంచి తొలగించి నిష్పాక్షిక విచారణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు.